చాకలి ఐలమ్మకు ఘన నివాళి

వీరనారి చాకలి ఐలమ్మ జయంతిని పురస్కరించుకొని గురువారం జిల్లా వ్యాప్తంగా ఘనంగా నివాళులర్పించారు. సంగారెడ్డిలో కలెక్టరేట్‌లో కలెక్టర్ క్రాంతి, ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో చింతా ప్రభాకర్, పటాన్‌చెరులో ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి, నారాయణఖేడ్‌లో ఎమ్మెల్యే సంజీవ్‌రెడ్డి చాకలి ఐలమ్మ చిత్రపటాలకు నివాళి అర్పించి ఆమె పోరాట గాథలను నెమరువేసుకున్నారు.

- నమస్తే తెలంగాణ నెట్‌వర్క్, సెప్టెంబర్ 26

సంగారెడ్డి: వీరనారి ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ప్రభాకర్, నాయకులు

నారాయణఖేడ్: చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే సంజీవ్‌రెడ్డి

సంగారెడ్డి కలెక్టరేట్: నివాళులర్పిస్తున్న కలెక్టర్ వల్లూరు క్రాంతి, అధికారులు

రామచంద్రాపురం: నివాళులర్పిస్తున్న బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆదర్శ్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ అంజయ్య, తదితరులు

పటాన్‌చెరు: చాకలి ఐలమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి

అగ్రికల్చర్ టెక్నాలజీ ఎగ్జిబిన్‌ను ప్రదర్శిస్తున్న విద్యార్థి

సైన్స్ ఫెయిర్ అదుర్స్

రామచంద్రాపురం, సెప్టెంబర్ 26: భారతీనగర్ డివిజన్‌లోని ఎల్ఐజీలోని విద్యాభారతీ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన సైన్స్‌ఫెయిర్ ఆకట్టుకుంటున్నది. సరస్వతి విద్యాపీఠం ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి సైన్స్‌ఫెయిర్‌ని నిర్వహిస్తున్నారు. రెండో రోజు సైన్స్ ఫెయిర్‌ని తిలకించేందుకు విద్యార్థులకు అనుమతించారు. విద్యార్థులు తయారుచేసిన ప్రదర్శనలు ఎంతగానే ఆకట్టుకున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా సరస్వతి విద్యాపీఠాలకు చెందిన విద్యార్థులు సైన్స్‌ఫెయిర్‌లో పాల్గొని ఎగ్జిబిట్స్‌ని ప్రదర్శించారు. మొత్తం 367మంది విద్యార్థులు 324 ఎగ్జిబిట్స్‌ని ప్రదర్శించారు. వివిధ జిల్లాల నుంచి వచ్చిన విద్యార్థులకు బస, భోజన వసతి కల్పించారు. ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ చీఫ్ సైంటిస్ట్ డాక్టర్ నాగయ్యతోపాటు ఇతర ప్రొఫెసర్లు జడ్జిలుగా వ్యావహరించారు. కార్యక్రమంలో పాఠశాల అధ్యక్షుడు దామోదర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు అవధానులు, కార్యదర్శులు శ్రీనివాసరావు, గాల్‌రెడ్డి, సహకార్యదర్శి భూపాల్‌రెడ్డి, కోశాధికారి శ్రీనివాసులు, సభ్యులు సత్తయ్య, రాజానందం, భీమ్‌రావు, కృష్ణాగౌడ్, లక్ష్మణ్, ప్రిన్సిపాల్ పద్మజ, సిబ్బంది పాల్గొన్నారు.

'ఆ సంతకం నాది కాదు'

మమత, వీరన్నగూడెం మాజీ సర్పంచ్

గుమ్మడిదల, సెప్టెంబర్ 26: 24 నవంబర్ 2011న జరిగిన జిల్లా స్థాయి లోకల్ బాడీ సమావేశంలో తాను పాల్గొనలేదని, ఆ సంతకం తనది కాదని మాజీ సర్పంచ్ స్పష్టం చేశారు. గురువారం మండలంలోని వీరన్నగూడెంలో బీఆర్ఎస్ నాయకురాలు, మాజీ సర్పంచ్ మమతా వేణు మాట్లాడుతూ గతంలో జీహెచ్ఎంఎసీ ఆధ్వర్యంలో మండలంలోని నల్లవల్లి అటవీ ప్రాంతంలో ఏర్పాటు చేసే డంపింగ్‌యార్డు కోసం చేపట్టిన జిల్లా స్థాయి స్థానిక నాయకుల సమావేశంలో తాను పాల్గొనలేదని స్పష్టం చేశారు. డంపింగ్‌యార్డు ఏర్పాటు కోసం తన సంతకం ఉందని ఇటీవల కాంగ్రెస్ నాయకులు చేసిన ఆరోపణలు పూర్తి అవాస్తవమన్నారు. ఆ సమావేశంలో అప్పటి కలెక్టర్ రాజర్షిషా, డీఎఫ్‌వో వెంకటేశ్వర్‌రావు, ట్రైబల్ వెల్‌ఫేర్ అధికారి ఫిరంగి, హత్నూర మండలం చిక్‌మద్దుర సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, వీరన్నగూడెం సర్పంచ్ పొన్నబోయిన మమతావేణు, పుల్కల్ మండలం బొమ్మరెడ్డిగూడెం సర్పంచ్ మమత పాల్గొన్నట్లు స్థానిక కాంగ్రెస్ నాయకులు చెబుతున్నారన్నారు. అప్పటి సమావేశంలో తాను పాల్గొనలేదని, పైగా ఆ సంతకం తనది కాదని తెలిపారు. డంపింగ్ యార్డు వద్దని జనవరి 23, 2024లో మండలంలోని అన్ని గ్రామాల్లో ఏకగ్రీవ తీర్మానం చేసినట్లు తెలిపారు. దీనిపై కాంగ్రెస్ నాయకుల ఆరోపణలు సత్యదూరమన్నారు.

డంపింగ్‌యార్డుపై సమష్టిగా పోరాడుదాం

గుమ్మడిదల, సెప్టెంబర్ 26: మండలంలోని నల్లవల్లి అటవీ ప్రాంతంలోని ఫ్యారానగర్ ప్రాంతంలో జీహెచ్ఎంసీ హైదరాబాద్ వారు ఏర్పాటు చేసే డంపింగ్‌యార్డును అఖిలపక్ష పార్టీలన్నీ కలిసి సమష్టిగా వద్దని పాలకులకు తెలియజేయడానికి ముందుకు రావాలని మాజీ జడ్పీటీసీ చిన్నపాపని కుమార్ గౌడ్ పిలుపునిచ్చారు. గురువారం మండల కేంద్రంలో మాట్లాడుతూ ఇటీవల కొంత మంది మంత్రి దామోదరకు విషయాన్ని తెలియజేశారన్నారు. దీనిని గత ప్రభుత్వం మంజూరు చేసినా అన్ని గ్రామ పంచాయతీలువద్దని ఏకగ్రీవ తీర్మానం చేశాయన్నారు. గతంలో జడ్పీ సమావేశంలోనూ అప్పటి మంత్రి హరీశ్‌రావుకు విన్నవించి డంపింగ్ యార్డు ఏర్పాటును అడ్డుకున్నామని తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ సర్కారు వచ్చిన తర్వాత తిరిగి డంపింగ్‌యార్డు విషయం తెరపైకి వచ్చిందని, దీనిపై కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. డంపింగ్ యార్డు ఏర్పాటును కలిసికట్టుగా అడ్డుకుందామన్నారు. నల్లవల్లి అటవీ ప్రాంతంలో డంపింగ్ యార్డు ఏర్పాటు చేస్తే నర్సాపూర్‌లోని రాయచెరువు కూడా కలుషితమవుతుందన్నారు.

బాధ్యతతో విధులు నిర్వహించాలి

ఎంఈవో ఆహ్వానిస్తున్న సీఆర్‌పీలు, టీచర్లు

సిర్గాపూర్, సెప్టెంబర్ 26: విద్యాభివృద్ధికి ఉపాధ్యాయులు బాధ్యతతో విధులు నిర్వహించాలని ఎంఈవో నాగారం శ్రీనివాస్ అన్నారు. గురువారం సిర్గాపూర్ హైస్కూల్ ప్రాంగణంలోని ఓ భవనంలో మండల వనరుల కేంద్రంలో కొత్తగా ఎంఈవో ఛాంబర్ గదిని ప్రారంభించారు. ఈమేరకు కొత్త ఎంఈవోకు మండల సీఆర్పీలు శివకుమార్ స్వామి, ప్రకాశ్‌రావుపాటిల్, శోభ తదితరులు స్వాగతించి, ఘనంగా శాలువాలతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం స్థానిక ఉపాధ్యాయులు, సీఆర్పీలతో సమావేశమయ్యారు.

విద్యార్థులకు ఇబ్బందులు కలగొద్దు

జోగిపేటలో రికార్డులను పరిశీలిస్తున్న ఏఎస్‌డబ్ల్యూవో శంకర్

అందోల్, సెప్టెంబర్ 26: వసతి గృహాల్లోని విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించడంతోపాటు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూడాలని ఏఎస్‌డబ్ల్యూవో శంకర్ అన్నారు. గురువారం నేరడిగుంట వసతి గృహంతోపాటు జోగిపేటలోని వసతి గృహాలను తనిఖీచేశారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు ఇబ్బందులు రాకుండా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. మంచి భోజనం అందించడంతోపాటు వారికి కావాల్సిన వసతుల కల్పనపై దృష్టి పెట్టాలన్నారు. సరైన వసతులు కల్పించకపోయినా, అధికారులు అందుబాటులో లేకుండా నిర్లక్ష్యం వహించినా చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. వసతీ గృహాల అధికారులు మహేశ్వర్, నర్సింహులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ స్వచ్ఛతను పాటించాలి

శ్రమదానంలో రోడ్లు శుభ్రం చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ రోజాబాల్‌రెడ్డి

బొల్లారం, సెప్టెంబర్ 26: శుభ్రతే ధ్యేయంగా ప్రతి ఒక్కరూ స్వచ్ఛతను పాటించాలని బొల్లారం మున్సిపల్ చైర్‌పర్సన్ రోజాబాల్ రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం బొల్లారం మున్సిపాలిటీ పరిధిలోని ఎనిమిదవ వార్డు పూరి జగన్నాథ్ ఆలయ సమీపంలో కమిషనర్ మంగతాయారు, స్థానిక మహిళలతో కలిసి శ్రమదానం చేశారు. ఆలయ సమీపంలోని రోడ్లను చీపుర్లు పట్టి చెత్తా చెదారాన్ని ఊచ్చారు. ప్రతి ఒక్కరు స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ వినోద్‌కుమార్, స్వయం సహాయక సంఘాల మహిళలు పాల్గొన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన

వ్యక్తిగత పరిశుభ్రతపై విద్యార్థులకు ఎంపీడీవో అవగాహన కల్పించారు. గురువారం మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఎంపీడీవో డీ. ఉమాదేవి పాల్గొని వ్యక్తి గత పరిశుభ్రతపై అవగాహన కలిగించారు. ప్రతి విద్యార్థి చేతులు శుభ్రంగా సబ్బుతో కడుకోవాలన్నారు. భోజన సమయంలో చేతులు శుభ్రం చేసుకోవడం వల్ల అనారోగ్య సమస్యలు రావని సూచించారు. స్వచ్ఛ హీ సేవా కార్యక్రమంలో ప్రతి పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కలిగిస్తున్నట్లు తెలిపారు. వీరితో టు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రైతులందరికీ రుణమాఫీ చేయాలి

రాయికోడ్, సెప్టెంబర్ 26: రైతులకు ఏకకాలంలో రూ.2 లక్షల రుణమాఫీ చేయాలని బీఆర్ఎస్ మండల ఉపాధ్యక్షుడు మల్లేశం కురుమ డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రమైన రాయికోడ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ.. ఇప్పటికీ 50 శాతం మంది రైతులకు పూర్తిస్థాయిలో రుణమాఫీ కాలేదని ఆరోపించారు. వివిధ రకాల కారణాలు చూపుతూ రైతులను ఇబ్బందులకు గురిచేయడం బాధాకరమన్నారు. రైతులు బాగుంటేనే రాజ్యం బాగుటుందని, రూణమాఫీ కాని రైతుల తరపున త్వరలో మండలంలో బీఆర్ఎస్ అధ్వర్యంలో భారీ ఎత్తున సమావేశం నిర్వహిస్తామని తెలిపారు.

పటాన్‌చెరు ఎంఈవోగా నాగేశ్వర్‌రావు నాయక్

పటాన్‌చెరు, సెప్టెంబర్ 26: పటాన్‌చెరు మండల విద్యాధికారిగా నాగేశ్వర్‌రావు నాయక్ బాధ్యతలు స్వీకరించారు. గురువారం ఎంఈవో కార్యాలయంలో కొత్త విద్యాధికారిగా నాగేశ్వర్‌రావు నాయక్ బాధ్యతలు స్వీకరించి మాట్లాడారు. పటాన్‌చెరు మండలంలో పాఠశాల విద్యను బలోపేతం చేస్తానని పేర్కొన్నారు. ఉన్నత ప్రమాణాలతో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందేలా చేస్తానన్నారు.

బొల్లారం ఎస్సై-2 గా రాములు

బొల్లారం, సెప్టెంబర్ 26: బొల్లారం మున్సిపల్ ఎస్సై-2గా రాములు గురువారం బాధ్యతలు స్వీకరించారు. వికారాబాద్ జిల్లా తాండూర్ నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. మున్సిపాలిటీలో రెండో అదనపు ఎస్సైగా రాములు బాధ్యతలు తీసుకున్నారు. ఈ మేరకు ఎస్సైకి స్టేషన్ సిబ్బంది స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలిపారు. ఎస్ఐ-1 దశరథ్ ఉన్నారు.

పీఆర్టీయూ హత్నూర మండల కమిటీ ఎన్నిక

హత్నూర, సెప్టెంబర్ 26: పీఆర్టీయూ హత్నూర మండల కమిటీని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు నూతన అధ్యక్షుడు వెంకటస్వామి తెలిపారు. ప్రధాన కార్యదర్శి పద్మనాభం, అసోసియేట్ అధ్యక్షుడు అరున్‌కుమార్, శిరీష, ఉపాధ్యక్షుడు అజ్మత్‌అలీ, మహిళా కార్యదర్శి అరుణ, కార్యదర్శులు నటరాజన్, సుమలత ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

లోక్ అదాలత్ సద్వినియోగం చేసుకోవాలి

జిన్నారం, సెప్టెంబర్ 26: జిల్లా కోర్టులో ఈనెల 28న జరిగే జాతీయ మెగా లోక్ అదాలత్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిన్నారం ఎస్ఐ నాగలక్ష్మి కోరారు. గురువారం ఆమె మాట్లాడుతూ జాతీయ మెగా లోక్ అదాలత్ వివరాలు వెల్లడించారు. సివిల్ కేసులు, క్రిమినల్ కేసులు, యాక్సిడెంట్ కేసులు, కక్షిదారులు రాజీ పడేందుకు జాతీయ మెగా లోక్ అదాలత్‌ను వినియోగించుకోవాలన్నారు.

నారాయణఖేడ్‌లో..

నారాయణఖేడ్, సెప్టెంబర్ 26: నారాయణఖేడ్ మున్సిఫ్ కోర్టులో ఈనెల 28వ తేదీ శనివారం నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని స్థానిక జూనియర్ సివిల్ జడ్జి శ్రీధర్ మందని సూచించారు. క్షణికావేశంలో చోటుచేసుకున్న వివాదాల కారణంగా కేసులు నమోదై దీర్ఘకాలికంగా కోర్టుల చుట్టూ తిరుగుతూ సమయాన్ని, డబ్బులను వృథా చేసుకోకుండా లోక్ అదాలత్‌లో కేసులు పరిష్కరించుకోవాలన్నారు. ఇరువర్గాల సమ్మతంతో కేసులను పరిష్కరించుకునే అవకాశం ఉందన్నారు.

పిడుగుపాటుకు వ్యక్తి మృతి

జాటిపటేల్(ఫైల్)

గుమ్మడిదల, సెప్టెంబర్ 26: పిడుగుపాటుకు వ్యక్తి మృతి చెందిన ఘటన అన్నారంలో చోటు చేసుకుంది. ఎస్సై మహేశ్వర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఒడిశా రాష్ట్రానికి చెందిన జాటి పటేల్ తన భార్య సంజుక్తా పటేల్‌తో కలిసి మండలంలోని అన్నారం గ్రామానికి బతుకుదెరువు కోసం వచ్చాడు. గ్రామానికి చెందిన కుమ్మరి అశోక్ వద్ద పశువుల కాపరిగా పని చేస్తున్నాడు. రోజు మాదిరిగానే మంగళవారం పశువులను మేపడానికి యజమాని కొడుకు హరీశ్‌తో వెళ్లిన జాటి పటేల్ రాత్రి వరకు రాలేదు. ఫోన్ చేయగా స్పందించకపోవడంతో చుట్టూ పరిసరాలను యజమాని అశోక్‌తో కలిసి వెతికారు. బుధవారం మధ్యాహ్నం 2 గంటల ప్రాంతంలో పంచాయతీ పరిధిలోని డంపింగ్‌యార్డు పరిసరాల్లో మృతిచెంది కనిపించాడు. మంగళవారం ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం పడడంతో పాటుపిడుగు పడినట్లు చుట్టు పరిసరాలను పరిశీలిస్తే తెలిసింది. మృతి చెందిన వ్యక్తి శరీరం ఒకపక్క కాలినట్లు గుర్తించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రాఘవపూర్, కుసునూర్ రోడ్డులో రాకపోకలు నిలిపివేసిన అధికారులు

రాఘవపూర్-కుసునూర్ మధ్య రాకపోకలు నిలిపివేత

జహీరాబాద్, సెప్టెంబర్ 26: న్యాల్‌కల్, రాయికోడ్ మండలాలకు రాకపోకలు సాగించే రాఘవపూర్-కుసునూర్ రోడ్డు మార్గాన్ని గురువారం మండల అధికారులు మూసివేశారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఈ రోడ్డు మార్గంలోని కల్వర్టు కూలిపోవడంతోపాటు పలు చోట్ల గుంతలు పడి అధ్వానంగా మారింది. దీంతో సంబంధిత అధికారులు రోడ్డు మరమ్మతులు చేసే వరకు న్యాల్‌కల్ మండల తహసీల్దార్ భూపాల్, ఎంపీవో సురేశ్ రాకపోకలను నిలిపివేశారు. రోడ్డు మరమ్మతులు పూర్తయ్యే వరకూ వాహనదారులు సహకరించాలని కోరారు.

లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం

వైద్య శిబిరంలో క్లబ్ సభ్యులు, వైద్యులు

అందోల్, సెప్టెంబర్ 26: జోగిపేట లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో గురువారం బాలికల ఉన్నత పాఠశాల, ప్రథామికోన్నత పాఠశాల విద్యార్థులకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించినట్లు అధ్యక్షుడు అల్లె శ్రీకాంత్ తెలిపారు. దంత వైద్య పరీక్షలో పలువురు విద్యార్థులకు మందులు, బ్రష్‌లు అందజేశారు. బాలికల పాఠశాలలో 380 మందికి, ప్రాథమిక పాఠశాలకు చెందిన 150 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ జిల్లా కార్యదర్శులు డాక్టర్ అనంతరెడ్డి, ఆకుల రాంబాబు, జోన్ చైర్మన్ రామకృష్ణ, సభ్యులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో పీడీ మృతి

నర్సింహులు (ఫైల్)

హత్నూర/కోహీర్, సెప్టెంబర్ 26: హత్నూర మండలం కాసాల గ్రామానికి చెందిన పీడీ నర్సింహులు(49) క్యాన్సర్‌తో బాధపడుతూ గురువారం మృతిచెందినట్లు గ్రామస్తులు తెలిపారు. నర్సింహులు రెండు నెలలుగా క్యాన్సర్‌తో హైదరాబాద్‌లో ఓ ప్రైవేటు దవాఖానలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి గురువారం మృతి చెందాడు. చికిత్స కోసం రూ.35లక్షల వరకు ఖర్చుచేసినా ఫలితం లేదని కుటుం సభ్యులు ఆవేదన వ్యక్తంచేశారు. నర్సింహులు కోహీర్ మండలం గురుజువాడ ప్రభుత్వ పాఠశాలలో పీఈటీగా విధులు నిర్వహిస్తున్నాడు. మృతుడికి భార్య వాణి, కొడుకు హరీశ్‌భరద్వాజ్, కూతురు స్వీటీ ఉన్నారు. అతడి అకాల మరణం చెందడంతో గ్రామంలో విషాధచాయలు అలుముకున్నాయి. పీడీ నర్సింహులు మృతికి కోహీర్ ఎంఈవో జాకీర్‌హుస్సేన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు సంతాపం తెలిపారు.

ఉద్యమకారుడు మృతి

భిక్షపతి(ఫైల్)

జిన్నారం, సెప్టెంబర్ 26: జిన్నారం గ్రామానికి చెందిన తెలంగాణ ఉద్యకారుడు కొంపల్లి భిక్షపతి(28) అనారోగ్యంతో మృతి చెందాడు. ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం జరిగిన కార్యక్రమాల్లో భిక్షపతి చురుగ్గా పాల్గొన్నారు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన బుధవారం సాయంత్రం మృతి చెందారు. ఆయన మృతి పట్ల బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ నాయకులు సంతాపం ప్రకటించారు. భిక్షపతి అంత్యక్రియలకు జిన్నారం మాజీ ఎంపీపీ రవీందర్‌గౌడ్ రూ.5వేలు అందించారు.

ఇండ్ల నిర్మాణ పనుల్లో వేగం పెంచాలి

మాట్లాడుతున్న కలెక్టర్ వల్లూరు క్రాంతి

సంగారెడ్డి కలెక్టరేట్, సెప్టెంబర్ 26: జిల్లాలో వివిధ ప్రాంతాల్లో నిర్మాణంలో ఉన్న డబుల్ బెడ్రూం ఇండ్ల పనుల్లో వేగం పెంచాలని కలెక్టర్ వల్లూరు క్రాంతి అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో వివిధ ఇంజినీరింగ్ శాఖల అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆయా నిర్మాణాలను సకాలంలో పూర్తి చేసి ప్రభుత్వానికి అందించాలని గృహ నిర్మాణ శాఖ ఇంజనీరింగ్ అధికారులు, కాంట్రాక్టర్లను ఆదేశించారు. పనుల పూర్తికి కావాల్సిన బడ్జెట్ ప్రతిపాదనలు సిద్ధం చేసి హౌసింగ్ మేనేజింగ్ డైరెక్టర్‌కి పంపించాలని జిల్లా గృహ నిర్మాణ శాఖ మేనేజర్ శ్రీనివాసరావును ఆదేశించారు. జిల్లాలో ఇటీవల కురిసిన వర్షాలు, వరదల కారణంగా దెబ్బతిన్న రోడ్లకు వెంటనే మరమ్మతులు చేపట్టాలన్నారు. అంగన్వాడీ భవనాల్లో మరుగుదొడ్లు, అమ్మ ఆదర్శ పాఠశాలల పనులు వేగవంతం చేయాలన్నారు. పనులు పూర్తి చేసిన కాంట్రాక్టర్లకు సకాలంలో బిల్లులు చెల్లించాలన్నారు. మహిళా శక్తి కార్యక్రమంలో భాగంగా మహిళా క్యాంటీన్లు వెంటనే ప్రారంభించేలా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. సమావేశంలో పంచాయతీరాజ్ ఈఈ జగదీశ్, డీఆర్డీవో జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణ పనుల నిలిపివేత

అక్రమ నిర్మాణం వద్ద సామగ్రిని జప్తు చేస్తున్న ఇస్నాపూర్ కార్యదర్శి, సిబ్బంది

పటాన్‌చెరు, సెప్టెంబర్ 26: ఇస్నాపూర్ పంచాయితీలో అనుమతులకు మించి అదనపు అంతస్తులు వేస్తున్నారనే ఫిర్యాదు మేరకు కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి చర్యలు తీసుకున్నారు. గురువారం పటాన్‌చెరు మండలం ఇస్నాపూర్ చౌరస్తా ఇండస్ట్రియల్ రోడ్డులో అనుమతులు లేని బహుళ అంతస్తులు నిర్మిస్తున్న ఇంటిని పరిశీలించి పనులను నిలిపివేసి సామగ్రిని జప్తు చేశారు. పనులు తిరిగి కొనసాగిస్తే కఠిన చర్యలు ఉంటాయని యజమానిని హెచ్చరించారు. గతంలోను నిబంధనలు ఉల్లంఘించి అదనపు అంతస్తుతో వాణిజ్య సముదాయం నిర్మిస్తున్నారని వచ్చిన ఫిర్యాదుల మేరకు నోటీసులు కూడా ఇచ్చామని కార్యదర్శి గుర్తు చేశారు. ఈ భవనంపై అనేక ఫిర్యాదులు వస్తున్నాయని చర్యలకు దిగినట్లు తెలిపారు. ఇస్నాపూర్‌లో అక్రమ అంతస్తుల నిర్మాణాలను ఉపేక్షించేది లేదన్నారు. కార్యక్రమంలో కారోబార్ భూషణం, పంచాయితీ సిబ్బంది పాల్గొన్నారు.

రూ.20 వేల నష్టపరిహారం ఇవ్వాలి

క్షేత్రస్థాయిలో పంటలను పరిశీలిస్తున్న మాజీ సర్పంచ్ జగదీశ్వర్

ఝరాసంగం, సెప్టెంబర్ 26: అకాల వర్షాలకు నష్టపోయిన ప్రతిరైతుకూ రూ.20వేల నష్టపరిహారం అందజేసి ఆదుకోవాలని ఝరాసంగం మండల మాజీ సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు జగదీశ్వర్ డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రం శివారుతోపాటు కుప్పానగర్ శివారులో వర్షాలకు దెబ్బతిన్న సోయా, కంది, పత్తి పంటలను మండల నాయకులతో కలిసి పరిశీలించారు. రైతు ఒక ఎకరంలో పంట సాగు చేయడానికి సుమారు రూ.40వేల నుంచి రూ.50వేల పెట్టుబడి అవుతుందన్నారు. చేతికొచ్చిన పంట పూర్తిగా వర్షాలపాలు కావడంతో కనీసం రూ.10వేల ఆదాయం కూడా వచ్చేలా లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారన్నారు. రైతుబంధు లేదు పూర్తి స్థాయిలో రుణమాఫీ చేయలేదని ఆరోపించారు. రైతుల పట్ల ప్రభుత్వం వివక్ష చూపకుండా ఆదుకోవాలని కోరారు.

ఇంకా లభించని గల్లంతైన వ్యక్తి ఆచూకీ

జహీరాబాద్, సెప్టెంబర్ 26: మండలంలోని బూచినెల్లి శివారులోని నారింజవాగులో గల్లంతైన షాకీర్ ఆచూకీ లభించలేదు. గురువారం నారింజ వాగును తహసీల్దార్ రవీందర్, డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి, ఎంపీడీవో మహేందర్‌రెడ్డి సందర్శించారు. వాగులో గల్లంతైన షాకీర్ ఆచూకీ కోసం డ్రోన్ కెమెరా సహాయంతో గాలింపు చేపట్టారు. మండలంలోని కోత్తూర్(బి) శివారులోని నారింజవాగు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో గాలింపునకు వీలు లేకుండా పోయింది. డ్రోన్ కెమెరా సహాయంతో గాలింపు చేపట్టినప్పటికీ నారింజవాగు పరిసరా ప్రాంతంలో చెట్లు, పొదలు ఉండడంతో ఎలాంటి ఆచూకీ లభించలేదని చిరాగ్‌పల్లి పోలీసులు తెలిపారు. శుక్రవారం నారింజ వాగులో గల్లంతైన వ్యక్తి ఆచూకీ కోసం గాజ ఈతగాళ్లను రప్పించే ఏర్పాట్లు చేస్తున్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన

పనులను పరిశీలిస్తున్న డీపీవో సాయిబాబా

హత్నూర, సెప్టెంబర్ 26: మండలంలో ముచ్చర్ల గ్రామంలో కొనసాగుతున్న అభివృద్ధి పనులను గురువారం డీపీవో సాయిబాబా పరిశీలించారు. పల్లెప్రకృతివనం, వైకుంఠధామం, సీసీ రోడ్లు, మురుగు కాల్వలను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో డ్రైనేజీలు, రోడ్లను శుభ్రంగా ఉంచాలన్నారు. ప్రజలు వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. పంచాయతీ కార్యదర్శులు గ్రామాల్లో పర్యటించి పారిశుధ్య పనులు ముమ్మరంగా చేపట్టాలని ఆదేశించారు. స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీవో యూసూఫ్ ఉన్నారు.

జహీరాబాద్ ఎంపీవో లక్ష్మయ్య సస్పెన్షన్

జహీరాబాద్, సెప్టెంబర్ 26: జహీరాబాద్ ఎంపీవో లక్ష్మయ్యపై కలెక్టర్ వల్లూరి క్రాంతి సస్పెన్షన్ వేటు వేశారు. ఈ మేరకు గురువారం ఉత్తర్వులు జారీ చేసినట్లు మండల అభివృద్ధి అధికారి మహేందర్‌రెడ్డి తెలిపారు. గతంలో ఝరాసంగం మండలం ఎంపీవోగా పని చేస్తున్న సమయంలో మచ్నూర్ గ్రామ ప్రత్యేకాధికారిగా లక్ష్మయ్య విధులు నిర్వహించారు. అప్పట్లో ఆ గ్రామంలో ఇంటి నంబర్ల కేటాయింపులో ఆయన అక్రమాలకు పాల్పడ్డారు. జూన్‌లో గ్రామ నాయకులు, గ్రామస్తులు జిల్లా అధికారులకు ఫిర్యాదు చేశారు. జిల్లా పంచాయతీ అధికారి సాయిబాబా, ఈవోపీఆర్‌డీ అమృత అక్రమాలపై విచారణ చేపట్టి నివేదిక అందజేశారు. ఈ మేరకు కలెక్టర్ లక్ష్మయ్యపై సస్పెన్షన్ ఉత్తర్వులు జారీ చేశారని పేర్కొన్నారు.

టాప్ త్రీ ఏజెంట్లు, కస్టమర్లకు సన్మానం

సంగారెడ్డి, సెప్టెంబర్ 26: ఆర్టీసీ మెదక్ రీజియన్ నుంచి టాప్ త్రీ ఏజెంట్లు, కస్టమర్లను ఉమ్మడి జిల్లా రీజినల్ మేనేజర్ ప్రభులత సన్మానించారు. గురువారం పట్ట